క్లుప్తంగా

'బీర్ల'కు మంత్రి పదవి ఇవ్వాలి

దౌల్తాబాద్: ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని కొడంగల్ నియోకవర్గ కురుమ సంఘం కార్యదర్శి నాగప్పయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ వర్గానికి చెందిన ఐలయ్య.. అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తుచేశారు. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో కుర్మలు కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కీలక భూమిక పోషించారని, కుర్మలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు, దస్తప్ప, బాల్‌రాజు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఎంపీడీఓ విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా హరిజన్‌చేరి సమీపంలోని కేంద్రంలో వసతులు లేవని ఆమె దృష్టికి తేవడంతో.. అక్కడి నుంచి కేంద్రాన్ని పాఠశాలలోకి మార్పించారు. ఇదిలా ఉండగా.. రెండు రోజుల క్రితం మండలంలో కలెక్టర్ పర్యటించిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఆయన ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి.. భవనాలు, వసతులు, తాగునీరు తదితర సమస్యలు తెలుసుకుని నివేదిక ఇవ్వాలని చెప్పారని, ఈ మేరకు కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు ఎంపీడీఓ వెల్లడించారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి గోపాల్ ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ శిరీష

కొడంగల్: బోదకాలు బాధితులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని మలేరియా జిల్లా అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయనతో పాటు జోనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ శిరీషా పాటిల్.. ఫైలేరియా నివారణ, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అధికారి ప్రకాశం, సబ్ యూనిట్ ఆఫీసర్ పకీరప్ప, హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మసీదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



కడా అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

కొడంగల్ రూరల్: పీర్ల మసీదుల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మైనార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మొహర్రం పండగను నిర్వహించుకునే మసీదులు కొడంగల్ పట్టణంలో 11ఉన్నాయని, ఇందులో నాలుగు కూలిపోయాయని తెలిపారు. వాటిని తిరిగి నిర్మించేందుకు రూ. 20 లక్షల నిధులు కేటాయించాలన్నారు. మిగతా ఏడు మసీదులకు మెయింటెనెన్స్ నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌ఎం.గౌసన్, నాయకులు ఆసిఫ్ ఖాన్, సయ్యద్ ఇసాక్‌పాష, ఎండీ.అబ్దుల్, ఎండీ.జావిద్, షేక్‌రోమన్, ఎండీ.రిజ్వాన్, షేక్ ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూమిని పేదలకు పంచండి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పరిగి: ప్రభుత్వ సీలింగ్ భూమిని పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి పీర్ మహ్మద్ కోరారు. ఈ మేరకు గురువారం ఆర్డీఓ వాసుచంద్రకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. మండల పరిధి మిట్టకోడూర్ గ్రామంలో 56 ఎకరాల సీలింగ్ భూమి అన్యాక్రాంతం అయిందని, ఆ జాగను భూమి లేని నిరుపేదలకు ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి, చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్, నాయకులు యాదయ్య, రాంచంద్రయ్య, వెంకటయ్య, బందెయ్య, కృష్ణయ్య ఉన్నారు.

మా జీవనం గడిచేదెలా సారు

- ఐదు నెలలైనా అందని జీతాలు
- పారిశుద్ధ్య కార్మికుల ఆవేదన
- జీపీ కార్యాలయం ఎదుట నిరసన



హస్నాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

దుద్యాల్: నిత్యం గ్రామ సంరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడే పారిశుద్ధ్య కార్మికులు.. వేతనాలు అందక దుర్భర జీవితం గడుపుతున్నారు. ఐదు నెలలగా ప్రభుత్వం వారికి జీతాలు చెల్లించకపోవడంతో.. చేతిలో చిల్లిగవ్వ లేక అర్ధాకలితో అలమటిస్తున్నారు. అప్పుచేసి కడుపు నింపుకుంటున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జీతాలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు గురువారం మండల పరిధి హస్నాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడారు. అసలే అరకొర జీతాలు. ఐదు నెలలుగా అవి అందక కుటుంబ పోషన భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక మీదట ఎప్పటికప్పుడు వేతనం ఇవ్వాలని కోరారు. ఇదే విషయమై.. జీపీ కార్యదర్శి కృష్ణవేణిని వివరణ కోరగా.. పంచాయతీలో నిధులు లేక.. జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

అవార్డు.. ఆకలి తీర్చడం లేదు



తడి పొడి చెత్త వేరు చేయడంలో చేసిన కృషికి ఫలితంగా జాతీయ స్థాయిలో ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నా. కానీ ఏం లాభం. అది ఆకలి తీర్చడం లేదు. పనిచేసిన చోట పైసలు రాక కుటుంబ పోషన భారంగా మారింది. ఎక్కువ వేతనాలు పొందే ఉద్యోగులకు ఎప్పటికప్పుడు ఇస్తున్నారు. తక్కువ జీతంతో గ్రామ పరిశుభ్రతకు పాటుపడుతున్న మమ్మల్ని చిన్న చూపు చూస్తున్నారు. అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలి.

– లక్ష్మి, జాతీయ ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలు, హస్నాబాద్

బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు



కుల్కచర్ల: కేజీబీవీలో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారులు

- మాత్రలు వేసుకోండి.. ఆరోగ్యంగా ఉండండి
- వైద్యాధికారి వాజుద్దీన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్

కుల్కచర్ల: బాలికల్లో రక్తనివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని మండల వైద్యాధికారి వాజుద్దీన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ అన్నారు. గురువారం మండల పరిధి కుల్కచర్ల, రాంపూర్ తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థినులకు ఐరన్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రక్తహీనత నివారణకు బాలికలు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. రక్తహీనత ఉండి, శారీరకంగా ఎదగకపోవడం, ఎముకలు గట్టిపడకపోవడం వంటి లక్షణాలు ఉంటే.. ఈ మాత్రలు వేసుకుంటే ఫలితం ఉంటుందని తెలిపారు. ప్రతి గురువారాన్ని ఐరన్ పోలిక్ యాసిడ్ డేగా నిర్వహించాలని జిల్లా అధికారుల సూచన మేరకు ఇకపై ఈ కార్యక్రమం కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యురాలు మాధురి, కేజీబీవీ ప్రత్యేక అధికారి దేవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: విద్యార్థినులు ప్రతి గురువారం ఐరన్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్లు వేసుకుని, రక్తహీనతను తగ్గించుకోవాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల సూచించారు. పట్టణంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థినులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్, డీఈఓ బుచ్చిబాబు, మెడికల్ అధికారులు డాక్టర్ నిఖిల్, డాక్టర్ సృజన, శ్రీదేవి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూప, విద్యార్థినులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కొడంగల్ రూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉషశ్రీ తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమీక్షకు అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తి స్థా యి నివేదికలతో రావాలని, ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యల గురించి సభలో ప్రస్తావించి, పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నామని ఎంపీడీఓ జర్నప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి జడ్పీ చైర్ పర్సన్ సునీత మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు. సమీక్షకు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు రావాలని ఎంపీడీఓ సూచించారు.

రేపు తైబజార్ వేలం

కుల్కచర్ల: తైబజార్ వేలం శనివారం నిర్వహించనున్నామని తహసీల్దార్, కుల్కచర్ల గ్రామ ప్రత్యేక అధికారి మురళీదర్, జీపీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పే ర్కొన్నారు. ఆసక్తిగల వారు ధరావత్‌గా రూ. 50వేలు చెల్లించి, ఉదయం 9.30 గంటలకు చేపట్టే వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

ఆర్‌ఎస్‌యూ జిల్లా కమిటీ ఎన్నిక

కొడంగల్ రూరల్: రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్(ఆర్‌ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు బీమరాజు ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడుగా చంద్రకిరణ్, ఉపాధ్యక్షుడుగా బుట్ట అశోక్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌గౌడ్, శివ, కృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి వెలకట్టలేనిది



ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న నేతలు

కుల్కచర్ల: సమాజంలో విలువకట్టలేనిదని ఒక్క ఉపాధ్యాయ వృత్తి మాత్రమేనని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. చౌడాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న బి.రాములు ఉద్యోగ విరమణను పురస్కరించుకుని గురువారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజాన్ని ప్రభావితం చేసే వ్యక్తుల్లో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదన్నారు. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థుల ఉన్నతికి రాములు కృషి చేశారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ అబీబ్ అహ్మద్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, సీఆర్పీలు రఘు, విజయ్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్, మరికల్ ఎంపీటీసీ సత్యకుమార్, నాయకులు పాండురంగయ్య, నర్సింహా రెడ్డి, పీఆర్టీయూ నేతలు వెంకటేశ్, రాందాస్, బస్వరాజు, వెంకటయ్య, శేఖర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• 'నీట్'ను రద్దు చేయాలి

కొడంగల్: నీట్ పరీక్షను రద్దు చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ధర్నా చేసినట్లు తెలిపారు. పరీక్ష నిర్వహించిన ఎన్‌టీఏ సంస్థపై చర్యలు తీసుకుని, పరీక్షను రద్దు చేయాలన్నారు. అనంతరం మళ్లీ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ కొడంగల్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు నరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

• రేపు సర్వసభ్య సమావేశం

పరిగి: మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఉదయం 11గంటలకు సమీక్ష ఉంటుందన్నారు. కావున ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు హాజరు కావాలని సూచించారు.

• ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం వద్దు

కొడంగల్: ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమని, ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించి, గమ్యం చేరుకోవాలని కళకారులు సూచించారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సంస్థ కళాకారులతో ఆటపాటల రూపంలో ఆర్టీసీ ప్రయాణం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. తాండూరు డిపో మేనేజర్ సమత, అసిస్టెంట్ మేనేజర్ నిర్మల, కంట్రోలర్ హన్మంతు చారి, నవీన్, మోదిన్, శేఖర్ పాల్గొన్నారు.

• మూడు మీసేవా కేంద్రాలు మంజూరు

కుల్కచర్ల: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కుల్కచర్ల మండలానికి 3 మీసేవా కేంద్రాలు మంజూరు అయ్యాయని ఏపీఎం శోభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధి ముజాహిద్‌పూర్, బండవెల్కిచర్ల, సాల్వీడు గ్రామాల్లో వీటిని సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు త్వరలో వీటిని వనియోగంలోకి తెస్తామన్నారు.

• తడి పొడి చెత్త సేకరణ

కొడంగల్: మండల పరిధి హస్నాబాద్ గ్రామంలో పంచాయతీ కార్మికులు గురువారం తడి పొడి చెత్తను వేరు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న లక్ష్మి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆమెతో పాటు ఇతర కార్మికులు పాల్గొన్నారు.

• రానున్నవి మంచిరోజులు..

నవాబుపేట: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్‌వీ నాయకుడు ఘనపురం శాంతకుమార్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా ఉద్యమకారులు ధైర్యంగా ఉండాలని, మళ్లీ మంచి రోజులు వస్తాయని కేసీఆర్ చెప్పినట్లు ఆయన తెలిపారు.



• పనిచేసేవారికి గుర్తింపు



పరిగి: మంచిగా పనిచేసే వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. ఎస్‌జీటీలుగా విధులు నిర్వహించి పదోన్నతిపై వెళ్తున్న వారికి ట్రాన్స్‌ఫర్ చేసి, పదోన్నతిపై మండలానికి వచ్చిన ఉద్యోగులను జాయినింగ్ చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థిని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన విద్యా బోధన చేయాలని సూచించారు. శ్రద్ధతో విధులు నిర్వహించి, విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు.

• అభివృద్ధి పనులు పూర్తిచేయండి

కుల్కచర్ల: అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలో కొనసాగుతున్న పనులను పూర్తిచేసి, వినియోగంలోకి తెచ్చేందుకు సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. మండల పరిధి ముజాహిద్‌పూర్ గ్రామం ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పనుల నిర్వహణ ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్, మహిళా సమాఖ్య సీసీ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

• నేడు విద్యుత్ అంతరాయం

బొంరాస్‌పేట: హంసాన్‌పల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ నాగరాజు తెలిపారు. రేగడిమైలారం, లింగన్‌పల్లి, సత్తర్‌కుంటతండా, నాన్‌చెర్వుతండా, గడ్డమీదితండాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

• బోరు వేయించిన స్పీకర్



ధారూరు: అసెంబ్లీ ఎన్నికల్లో పీసీఎంతండా గిరిజనులకు తాగునీటి కష్టాలు తీరుస్తానని స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇచ్చిన హామీ మేరకు గురువారం బోరు వేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. గిరిజనులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని తెలుపుతూ.. ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనంతయ్య, కాంగ్రెస్ నాయకులు పూల్యానాయక్, శంకర్, అనిల్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

• ఎస్‌ఎఫ్‌ఐ నూతన కమిటీ నియామకం

తాండూరు టౌన్: స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్‌ఐ) తాండూరు డివిజన్ అధ్యక్షుడిగా దీపక్ రెడ్డి నియామకమయ్యారు. డివిజన్ ప్రధాన కార్యదర్శిగా సిరియాల, సభ్యులుగా శ్రీకాంత్, కళ్యాణ్, నవీన్, శ్రీనివాస్, గోపాల్‌లు ఎన్నికయ్యారు. గురువారం తాండూరులో జరిగిన సమావేశంలో నూతన కమిటీని నియమించారు. ఈ సందర్భంగా దీపక్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటం చేస్తామన్నారు. ఇందులో మహమూద్, అనిల్, శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆదర్శ' పనులు పూర్తి చేయండి

- నాణ్యతా ప్రమాణాలు పాటించాలి
- ప్రతి తరగతి గదిలో ఫ్యాన్ తప్పనిసరి
- ప్రత్యేక అధికారి అశోక్



ఎన్నారం పాఠశాలలో పనుల పురోగతిపై ఆరా తీస్తున్న స్పెషల్ ఆఫీసర్

బంట్వారం: అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రత్యేక అధికారి అశోక్ ఆదేశించారు. గురువారం ఆయన ఎంఈఓ చంద్రప్పతో కలిసి కోట్‌పల్లి మండలం ఎన్నారం, బుగ్గాపూర్, కోట్‌పల్లి పాఠశాలలను సందర్శించి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత విషయంలో రాజీ ప్రసక్తే లేదని చెప్పారు. పనుల్లో జాప్యం జరగకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు.

మండలానికి రూ.కోటి నిధులు

ఆదర్శ పాఠశాలల కింద కోట్‌పల్లి మండలానికి కోటి రూపాయలు మంజూరు అయ్యాయని ప్రత్యేక అధికారి తెలిపారు. ఆ నిధులతో పాఠశాలల మరమ్మతులు, విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. కాగా.. మరుగుదొడ్ల నిర్మాణంలో రన్నింగ్ వాటర్ ఉండేలా చూడాలని కమిటీ సభ్యులకు సూచించారు. పాఠశాలలు పరిశుభ్రంగా కనిపించాలని, చేపట్టిన పనులను బట్టే బిల్లుల చెల్లింపు ఉంటుందని పేర్కొన్నారు. హెచ్‌ఎంలు ఎప్పటి కప్పుడు పనులను పర్యవేక్షించాలన్నారు. ప్రతి తరగతి గదిలో అవసరమైన మేరకు ఫ్యాన్లు బిగించాలని, నాసిరకం ఎలక్ట్రానిక్ తదితర పరికరాలు వాడితే బిల్లుల చెల్లింపుల్లో ఇబ్బందులు ఎదురవుతాయని స్పష్టంచేశారు. ప్రభుత్వ నిబంధన ప్రకారమే పనులు చేపట్టాలని, ఇష్టారాజ్యంగా చేస్తే సమస్యలు తలెత్తుతాయని వివరించారు. ఇంజినీరింగ్ అధికారుల ఎంబీ రికార్డు ప్రకారమే డబ్బు చెల్లింపు జరుగుతుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, ఇన్‌చార్జి ఎంపీడీఓ డానియల్, హెచ్‌ఎంలు శారద, సీఆర్పీ నర్సింలు, పంచాయతీ కార్యదర్శులు వాసుమతి తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి



హెచ్‌ఎం సువర్ణను సన్మానిస్తున్న ఎంఈఓ తదితరులు

- మండల విద్యాధికారి విద్యాసాగర్

మర్పల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని, తాము చేస్తున్న పనిలో క్రమశిక్షణ అలవర్చుకుని, విధులను సక్రమంగా నిర్వహిస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మండల విద్యాధికారి విద్యాసాగర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేసిన పబ్బే సువర్ణ ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఎంసీఎం ఫంక్షన్ హాల్‌లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. హెచ్‌ఎం సువర్ణ 33 ఏళ్లపాటు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేశారని, ఎంతో మందిని ఉన్నతిగా తీర్చిదిద్దారని తెలిపారు. ఎలాంటి మచ్చలేకుండా ఉద్యోగ విరమణ పొందడం గర్వించదగిన విషయమన్నారు. శేష జీవితం ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ భర్త మధుకర్, కూతుళ్లు, అల్లుళ్లు, గొడుగు అపర్ణ, వినోద్ కుమార్, మలే మమత, మధుకర్, ఉపాధ్యాయులు, నాయకులు, విద్యార్థులు ఉన్నారు.

30న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



దోమ: ఎమ్మెల్యేతో అంబేడ్కర్ సంఘాల నేతలు

కొడంగల్ రూరల్: దోమ మండలం బ్రాహ్మణపల్లిలో ఈ నెల 30న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉందని అంబేడ్కర్ కొడంగల్ నియోజకవర్గ యువజన సంఘం అధ్యక్షుడు యు.రమేష్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మందారం వెంకటయ్య, ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, న్యాయవాది గోపాల్, సంఘం నాయకులు జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

దోమ: మండల పరిధి బ్రాహ్మణపల్లి గ్రామంలో ఆవిష్కరించబోయే డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డిని అంబేడ్కర్ సంఘాల నేతలు ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఆయన నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా నేతలు కలిశారు. కార్యక్రమంలో కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, బ్లాక్ అధ్యక్షుడు భరత్ కుమార్, అంబేడ్కర్ సంఘాల నేతలు రఘురాం, వెంకటయ్య, సాయిబాబ, నర్సింలు, లక్ష్మణ్, ఎల్లయ్య, వెంకటయ్య, సత్తయ్య, ప్రభు. ఆనందం తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు ఎస్‌ఏలుగా పదోన్నతి



కొడంగల్: విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులు



యాలాల: ఎంఈఓకు పదోన్నతి, బదిలీ పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

- హర్షం వ్యక్తంచేసిన ఉపాధ్యాయులు

కొడంగల్: నియోజకవర్గ పరిధి కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల, దౌల్తాబాద్ మండలాల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. పదోన్నతులతో బదిలీ అయిన టీచర్లు గురువారం ఆయా మండలాల్లో విధుల్లో చేరారు. కొడంగల్ మండలం నుంచి బొంరాస్‌పేట మండలానికి స్కూల్ అసిస్టెంట్‌గా బదిలీపై వెళ్లిన వారిలో బాకారం చంద్రశేఖర్, బి.మల్లయ్య ఉన్నారు. సుదీర్ఘకాలం అనంతరం పదోన్నతులకు అవకాశం కల్పించడం పట్ల టీచర్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

యాలాలలో..

యాలాల: మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో ఎస్జీటీలుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఎస్‌ఏ(స్కూల్ అసిస్టెంట్)లుగా పదోన్నతితో బదిలీ అయ్యారు. వెంకట్‌రాంరెడ్డి(మల్‌రెడ్డిపల్లి), శ్రీధర్‌రెడ్డి(విశ్వనాథ్‌పూర్), వెంకట్‌రెడ్డి(బషీర్‌మియాతండా), షాబుద్దీన్(కమాల్‌పూర్), మొగులప్ప(బెన్నూరు), బాలగోవింద్‌రెడ్డి(హరిజనవాడ యాలాల) భీమయ్య(అంబర్‌పేట), సులోచన(అంబర్‌పేట), రాఘవేందర్‌జోషి(దేవనూరు), నర్సింలు(అగ్గనూరు), మంజుల(అగ్గనూరు), చంద్రశేఖర్(దౌలాపూర్), ధన్‌సింగ్(ఎన్కెపల్లి) ఎస్‌ఏలుగా మండలం నుంచి ఇతర మండలాలకు బదిలీ అయ్యారు.

పీఆర్‌టీయూ సంఘం బాధ్యులు..

పీఆర్‌టీయూ సంఘం బాధ్యులు బదిలీ అయ్యారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి(ఎస్‌ఏ, సోషల్) బషీరాబాద్ మండలానికి, రాష్ట్ర సభ్యుడు వెంకట్‌రెడ్డి బొంరాస్‌పేట మండలానికి వెళ్లారు. మండల అధ్యక్షుడు ఇందోలు శ్రీధర్‌రెడ్డి బషీరాబాద్ మండలం జీవన్గికి బదిలీ అయ్యారు.

ఉపాధ్యాయుల హర్షం

బొంరాస్‌పేట: పదోన్నతుల అనంతరం ఉమ్మడి బొంరాస్‌పేట మండలం బొంరాస్‌పేట, దుద్యాల ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధుల్లో చేరుతూ హర్షం వ్యక్తంచేశారు. వివిధ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పదోన్నతులతో బదిలీలు కాగా.. నోడల్ అధికారి హరిలాల్‌కు నివేదించారు. ఈ సందర్భంగా ఎస్‌ఏలకు ఆయన స్వాగతం పలికారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ సూర్యనారాయణ

దోమ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్‌ఐ సూర్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎస్‌ఐ ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు గ్రామస్తులు, వాహనదారులకు శాంతిభద్రతలు, రోడ్డు ప్రమాదాల గురించి పోలీస్ సిబ్బందితో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనదారులు ధ్రువపత్రాలను వెంటే ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ విల్లర్ వారు సీటు బెల్ట్ ధరించి వాహనాలు నడిపించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం గడపాలని, చిన్నచిన్న తగాదాలు, గొడవలు పెట్టుకుని ఇబ్బందులకు గురి కావొద్దన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే 100 కాల్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ శ్రీనివాస్, నారాయణరెడ్డి, మాధవి పాల్గొన్నారు.